
ENTERED

# బందీలు

**-పెద్దింటి అశోక్‌కుమార్**



ముగ్గురు అందాల అక్కచెల్లెండ్లు.

ఒకరిని తియ్యరాదు. ఒకరిని పెట్టరాదు.

ఆ రూపాలు... సమ్మోహన దీపాలు.

మాటలతో మంత్రం వేయగలరు. చూపులతో చుట్టూ తిప్పుకోగలరు. సైగతో శాసించగలరు. అప్పుడెప్పుడో అమృతం తాగినట్టున్నారు. ఎప్పుడు చూసినా అదే అందం... అదే రూపం! అదే నవ్వు!!

ఒక్కచోట పెరిగారు. ఒక్క ఆకులో చదువుకున్నారు. ముగ్గురిది ఒకే దారి.

ఒకరికి పాడి పంటలకు కొదువలేదు.

ఒకరికి ఆకలి దప్పుల బాధ లేదు.

ఒకరికి భోగభాగ్యాలకు లోటులేదు.

అయినా బాధ. గుండెల నిండా బాధ. ఒకరికి తెలియకుండా ఒకరు ఒకే బాధతో కుమిలిపోతున్నారు. ఒకనాడు ఒకేచోట కలుసుకున్నారు.

ముగ్గురూ ముచ్చటగా ముచ్చట్లలో పడ్డారు. ఎంత బాధగా ఉన్నా దర్పం విడువరు కదా!

'అక్కా... అక్కా... నీ గురించి చెప్పవా... ఏం చేశావు... ఏం చూశావు... ఎలా ఉన్నావు' చెల్లెళ్లు.

అక్క చెప్పడానికి ఇష్టపడలేదు. చెల్లెళ్లు మాత్రం విడువలేదు. వెంటపడ్డారు. చెప్పు చెప్పు అన్నారు.

'చెప్పడానికేముంది చెల్లెలా... సప్త సముద్రాలను నెత్తిన మోస్తున్నదాన్ని. ఏడు ఖండాలుగా విస్తరించిన దాన్ని. గుట్టనై గట్టునై గుండునై కొండనై లోయనై పాయనై సైటునై ఎస్టేటునై అనేక రూపాలు ఎత్తుతున్న దాన్ని. రాజ్యమునై సామ్రాజ్యమునై దేశమునై రాష్ట్రమునై అవతారములు మారుస్తున్న దాన్ని...'

అక్క చెబుతుంది చెల్లెండ్లు వింటున్నారు.

'... మనిషి పుట్టుకకొక సార్థకత ఉండాలె చెల్లే... నలుగురిని దగ్గరకు తియ్యాలె... నలుగురికి నీడనియ్యాలె... నలుగురి సేవ చెయ్యాలె. ఈ రోజు ఇంట్ల... రేపుమంట్లె... ఇదే గదా మనిషి జన్మ. ఏం తిన్నామని కాదు... ఏం చేశామన్నది ముఖ్యం. అదీ కూడు... నీడలేని పేదలకు... నేను అదే చేస్తున్నాను. పంటనై ఇల్లు నిండుతున్నాను. అడవినై ఆనందాన్నిస్తున్నాను. రాజ్యమునై శాంతి సౌఖ్యాలనిస్తున్నాను... హద్దునై సరిహద్దునై భద్రత నిస్తున్నాను...'

'అబ్బో... అబ్బో... అక్క ఎన్ని మాటలు నేర్చింది... చెప్పడం బాగానే ఉంది చేతలో!...'

'చెల్లెళ్లారా... అక్కడ నా పేరు రోమన్... చక్రవర్తుల చరిత్ర... జూలియస్ సీజర్ పాలనలోఉన్నాను... సకల కళలకు నిలయాన్ని... సకల సంపదలకు నెలవును...'

'అక్కా... అక్కా... ఆగు బలహీనుడైన పాంపేను చంపిగదా... సీజర్ రాజయింది'

'చెల్లెలా! ఒకచోట నేను ఫ్రాన్స్‌ను. రాజరికాలకు వారసత్వపు పునాదిని. ప్రజలకు సుఖశాంతులు ఇచ్చిన దాన్ని... సంస్కృతిని నేర్పినదాన్ని...'

'అయ్యో అక్కా... నెపోలియన్ ఎందరిని చంపి నిన్ను ఏలుకున్నాడు. అది చెప్పలేం...'

'అక్కడ నేను పర్షియాను... తక్షశిలగా సరస్వతికి పుట్టినిల్లును. వర్తక వాణిజ్యాలు నెరపినదాన్ని. బుద్ధుని బోధనలకు అడుగడుగునా నీరాజనాలు పడుతున్న దాన్ని...'

'అక్కా... ఆగవే... రాజ్యదాహం గల అలెగ్జాండర్‌కు గదా... అక్కడ పట్టం గట్టింది'

అక్క హృదయం కలుక్కుమంది. చెప్పడం ఆపి చెల్లెండ్లను చూసింది. చెల్లెండ్లు ముక్కు విరుస్తున్నారు. మూతి ముడుస్తున్నారు. కళ్లు తిప్పుతున్నారు. ఎక్కడి శాంతి ఎక్కడి సౌఖ్యం అంతా రక్తపాతమే అంటున్నారు.

'అక్కా... అయ్యో... కౌటిల్యుడి కుటిల నీతికి... చంద్రగుప్తుడి అధికార వ్యామోహానికి కదా నువ్వు హారతులు పట్టింది.'

'చెల్లెలా... అక్కడ నేను ఢిల్లీని...'

'ఢిల్లీవా... నా తల్లీ ఆగాగు...' అడ్డుకున్నారు చెల్లెండ్లు.

అందునా చిన్నచెల్లెలు మహా గడుసు. పడుసా పెడుసా అన్నట్టుంది. అక్కను నోరెత్తనీయలేదు.

'తెలుసక్కా... తెలుసు. జయచంద్రుడి జయకేతనానివి. పృథ్వీరాజు మరణ శాసనానివి. గోరి ఘోరాలకు నోరు విప్పనిదానివి...'

ఇంకో చెల్లె అందుకుంది. 'అక్కా... అయితే నీ కథ అందరికీ తెలుసులే. ఆధీన రేఖ వద్ద సియాచిన్‌వి... పాకిస్తాన్ దురాక్రమణకు వశమైనదానివి. నేపాల్ దగ్గర కాలాపానీవి... బంగ్లా దగ్గర తీన్‌బిగావి... లావోస్ వద్ద వియత్నాంవి...'

మళ్లీ చిన్న చెల్లె అందుకుంది. 'అక్కా... అంతా తెలిసిందిలే... ప్రైయరీవైనా... స్టెప్పీవైనా... నల్లమలవైనా నాగావైనా... పట్నంలో చెరువువైనా రంగారెడ్డిలో ఎస్టేటువైనా... ఊరిపక్క రియల్ ఎస్టేటువైనా... నారుమడివైనా... బలవంతుల చేతుల్లో బందీవి... అవునా కాదా' నిలదీసింది.

అక్క ఫక్కున పలిగింది ఒక్కసారిగా కన్నీళ్ల పర్యంతమైంది.

'చెల్లెల్లారా... మీకు దాచడమెందుకు? నా బాధంతా అదేనమ్మా. అప్పటికీ ఇప్పటికీ బలవంతుల చేతుల్లోనే బందీని... ఇది గుర్తుకొచ్చినప్పుడల్లా కంపించిపోతాను. గుండె బీటలు వారిపోతుంది. గర్భంలో పేగులు మెలి తిరుగుతాయి... నాకు స్వేచ్ఛ కావాలమ్మా స్వేచ్ఛ...' అక్క మళ్లీ బావురుమంది.

చెల్లెండ్లిద్దరూ ఓదార్చి కూర్చోబెట్టారు.

'అక్కా... మరి నీ కథ... బాగున్నావా' చిన్నక్కను చెల్లె.

'నాకేం... ఆనందంగా ఉన్నాను. స్వేచ్ఛగా తిరుగగలను. ఆడగలను. పాడగలను...' చెప్పకుండా తప్పుకోవాలని చూసింది. అక్క అడుగలేదు కాని చెల్లెలు మాత్రం విడువలేదు.

చెప్పక తప్పింది కాదు చిన్నక్కకు.

'సరే... వినండి. సప్త సముద్రాలనై విస్తరించిన దాన్ని... జీవనదినై పొంగి జీవం పోసుకున్నదాన్ని... వాగునై వంగిన దాన్ని... వంకనై నవ్వినదాన్ని... నా ఉరుకులు పరుగులు పేదవాడి కంటినీరు తుడవటానికే... చెరువునై... కుంటనై... చెలిమెనై... చేదబావినై పేదల బతుకుల్లో నవ్వులు చల్లినదాన్ని... ధర్మాన్ని నమ్మినదాన్ని...'

అక్క ఆశ్చర్యంగా చూస్తుంది.

చెల్లెలి చెవియొగ్గి వింటుంది.

'... సముద్రం నుంచి ఆకాశానికి, ఆకాశం నుంచి నేలకు నేల నుంచి సముద్రానికి... సామాన్యుడి కోసం చక్రభ్రమణం చేస్తున్నదాన్ని... మంచుగడ్డగా ఒకచోట... మంచినీరుగా మరోచోట... గర్భజలమై లోలోన అవతార రూపాలు మారుస్తున్నదాన్ని...'

అక్క అమాయకంగా 'ఆహా' అంది.

చెల్లెలు అసూయగా 'చెప్పు... చెప్పు' అంది.

'అక్కడ నా పేరు నైలు.. ఈజిప్టుకు వరప్రసాదాన్ని. అస్వాన్ డ్యాంనై నిలిచి వేల మెగావాట్ల విద్యుత్తు... లక్షల ఎకరాల సాగు...'

'ఆగాగు...' అక్క అరిచింది.

'ఇక చెప్పకు' చెల్లెలు ముక్కు విరిచింది.

'అయ్యో... అక్కా... అదా కత... నైలుగా నువ్వు నడుస్తున్న దారిలో చిట్టచివరి దేశం గదా ఈజిప్ట్. నీకు నిండుదనాన్నిచ్చిన ఇథియోపియాను ఎండబెట్టి... పరుగు నేర్పిన సూడాన్‌ను పక్కనబెట్టి ఈజిప్ట్‌కే ఎందుకు వరాలిస్తున్నట్టు... వాళ్లకు నోరు

లేదని అగ్రదేశం అండ లేదని... అంతే కదూ!'

'అక్కా... అక్కడ నేను డాన్యూబ్‌ను...'

'ఏడు దేశాలు ఏలుతున్నావు... ఏ దేశానికి వరాలిస్తున్నావో తెలుసా?'

'హిమాలయ సానువుల్లో సింధును... పవిత్ర కైలాసగిరిని చుట్టి పంజాబ్‌లోకి అడుగుపెట్టాను...'

'అది తెలుసులేవమ్మా... ఇండియా పాకిస్తాన్‌కు చిచ్చుపెట్టి గదా... నోరున్న పంజాబ్‌కు పారుతున్నది'

'అక్కా... ఆగు. నర్మదను... కనుమల్లో పుట్టిన కన్యను ధైర్యం చేసి పడమరకు పారినదాన్ని... రాజస్థాన్ ఎడారుల్లో గడ్డి పరకనై నవ్వినదాన్ని... మూడు రాష్ట్రాల ముద్దుల తల్లిని...'

'అయితే నాల్గవ రాష్ట్రం రాజస్థాన్‌కు ఎందుకు వరాలిస్తున్నట్టు... ధర్మం న్యాయం అన్నావు గదా... మహారాష్ట్ర మీద మక్కువ ఏ ధర్మం తల్లీ...'



'అక్కా... ఇన్ని పండ్లు అమ్ముతుంది. ఇంత గిరాకీ ఉంది. ఇంత రేటుంది. అయినా ఈ తల్లి బతుకు ఇలా ఎందుకుంది? మొఖం మీద కత్తి వేటుకు రక్తం లేదు. నెత్తికి చమురు లేదు. వొంటికి చాలిన బట్టలేదు. కడుపుకు తిండి లేదు'

చెల్లి దెప్పి పొడిచింది. అక్క ఫక్కున నవ్వింది.

మనసు చిన్నబుచ్చుకున్నా లేని నవ్వును తెచ్చిపెట్టుకుంటూ 'పశ్చిమ కనుమల్లో కృష్ణమ్మను. మూడు రాష్ట్రాల ముంగిట ముగ్గులు పరిచి... ఆల్మట్టిలో కాలుపెట్టి... నారాయణపూర్‌లో నవ్వులు చింది... నాగార్జునలో పొగా వేసి...'

'ఆగాగు... ఆల్మట్టి ఆట తెలియంది కాదు. కర్నాటక గాయం చూడంది కాదు... అది న్యాయమేనా'

అక్క అడ్డుకున్నది చెల్లెలు నిలదీసింది. అయినా చిన్నక్క ఆగిపోలేదు.

'అక్కా... అక్కడ గంగను. పవిత్ర కార్యం కోసం శంభుని శిరము నుండి జారినదాన్ని... నా జన్మరహస్యం మీకు తెలియాలంటే భారతం... భారతం చదవాలి'

అక్క ఆపుకోలేక పోయింది. 'నాకూ ఉంది చెల్లే జన్మరహస్యం... సాక్షాత్తు విష్ణుమూర్తి భార్యను'

'అంత తొందర వద్దమ్మా... నీకు ఎప్పుడూ తొందరే... ఎప్పుడెక్కడుంటావో తెలియదు. ఎందుకుంటావో తెలియదు'

ఇద్దరికీ వాదులాట. దెప్పి పొడుచుకున్నారు. అక్క అడ్డు తగిలింది.

'నువ్వు గంగవైనా... గోదారివైనా... కావేరివైనా... ఎక్కడైనా నీతి నియమాల్ని పాటించావా... కావేరిగా కర్ణాటక పక్షపాతివి. కోర్టు తీర్పును లెక్కచేయక రాజ్యాంగ సంక్షోభాన్నే సృష్టించావు. గోదారిగా మహారాష్ట్ర మాయలో పడ్డావు...'

చెల్లెలు దెప్పి పొడుస్తుంటే చిన్నక్క దుఃఖాన్ని ఆపుకోలేక పోతోంది.

'పెద్దక్కా... చిన్నక్క కథ విను. గంగగా పుట్టి యుపి బీహార్ బెంగాల్ నుంచి బంగ్లాలోకి అడుగుపెడుతుండా ఇక్కడ దేశాల నడుమ చిచ్చు... చెప్పొద్దు గాని పరక్కా బ్యారేజి వద్ద నిలిచి నోరులేని బంగ్లాను ఎంత మోసం చేసిందో నోరున్న బెంగాలులకు అంతే ఊడిగం చేసింది.'

పెద్దక్క ఆపుకోలేక పోయింది. 'అయ్యో చెల్లే అంతే కాదు... గర్భంలో దాగి పొలాల్లో పంటనై మొలుస్తున్నానన్నదా... ఎక్కడి పంట ఎక్కడి పెంట. అక్కడా నోరున్నోడిదే ఊరు. ఇంకోసంగతి నీకు తెలియదు.. బక్క రైతుల బొక్కలిరిచి మల్టీనేషన్ కంపెనీలకు సిరుల పంట పండిస్తుంది' అన్నది.

గుండె కలుక్కుమంది. తన రహస్యం దాచినా దాగదని తెలిసిపోయింది.

'అక్కా... అక్కా... నువ్వు నోరున్నోడి సొత్తువి అవునా కాదా...' చెల్లెలు నిలదీసింది.

అక్క దుఃఖం ఆపుకోలేకపోయింది. అక్క మీద పడి బావురుమంది. 'నిజమమ్మా... నిజమే... నోరున్నోడి ఊరునయ్యాను... నీతిలేదు రీతి లేదు.. నా బాధంతా అదే నమ్మా... అందుకే ఎవరికీ మొహం చూపించకుండా పాతాళంలోకి వెళ్ళిపోయాను... నాకూ స్వేచ్ఛ కావాలమ్మా స్వేచ్ఛ'

అక్క చెల్లెల్లిద్దరి బాధ ఒక్కటే అని తెలిశాక ఇద్దరి మనసులు తేలికపడ్డాయి.

'చెల్లే... చెల్లే... నీకత చెప్పవా...' అక్కలిద్దరూ అడిగారు.

చెల్లెలు గలగల నవ్వింది. ఆ నవ్వు తళతళ మెరిసింది. 'అంతలేదక్కా... ఏదో గుట్టుగా బతుకుతున్నదాన్ని... నాకు రాజు పేదా బేధం లేదు. అందరినీ సమానంగా చూస్తాను' అన్నది.

అక్కలిద్దరూ మూతి ముడుచుకున్నారు. ఎక్కడో దొరకక పోవులే అనుకున్నారు.

'మీలా పవిత్రమైన పేర్లు లెవ్వు... పేరుపేరుకో చరిత్ర లేదు. విశాల హృదయమూ కాదు... విషణ్ణ వదనమూ కాదు... ఎవరికీ దాసోహం చేయను. కష్టే ఫలి. ఎవరెంత కష్టపడితే అంత ఫలితాన్నిస్తాను. నన్నెవ్వరూ మీలా మాయ చెయ్యలేరు మోసం చెయ్యలేరు'

'ఏ... చెప్పింది చాలు... అసలు విషయం చెప్పు' అక్క అడిగింది.

చెల్లెలు చెప్పడం ఆపింది లేచి నవ్వుతూ పరుగందుకుంది. పరుగెత్తుతూ పరుగెత్తుతూ '... ఉగాండాలో సిల్లింగ్‌ను... పెరూలో సోల్‌ను... స్పెయిన్‌లో పెసెటాను... ఫ్రాన్స్‌లో ఫ్రాంక్‌ను.. దేశమేదైనా కానీ... ప్రాంతం ఎక్కడైనా కానీ... కష్టజీవి సొంతాన్ని...' అన్నది.

అక్కలిద్దరూ పరుగు. చెల్లెల్ని అందుకోవాలని... చాలా దూరం... చాలాచాలా దూరం. అందినట్టే అంది చెల్లెలు మాయం.

'అక్కా చూశావా... దాని ఆట. మనల్ని అనాల్సిన మాటలన్నీ అని తను మాత్రం తప్పుకుంది'

'ఎక్కడికెళ్తుందిలే. అందుకుందాం... పరిగెత్తు... ఊ... ఇంకా'

'అబ్బ... ఎంత మాయ చేసింది... ముందుగా దాన్నే చెప్పమనాల్సింది...'

పరుగు... పరుగే పరుగు. అందడం లేదు. అదే మాట. అదే నవ్వు. అందినట్టే అంది అందకుండా దూరంగా...

'అక్కా... అబ్బా... ఆయాసం. నేనెన్నడూ ఇంతగా పరుగెత్తలేదు. ఇక ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేను. దానికతా వద్దు... అదీ వద్దు. ఏముందిలే... అది కూడా ఎవరికో ఊడిగం చేస్తుంటుంది. మనతో చెబితే ఎక్కడ దెప్పి పొడుస్తామోనని ఇలా అందకుండా దూరంగా అందినట్టే అంది వేగంగా పరుగెత్తుతుంది. అది ఎప్పుడూ ఇంతే... దాగుడుమూతలు...' చెల్లె చతికిలబడ్డది. అక్క ఆగిపోయింది.

ఇద్దరూ తర్జనభర్జన. ఎలా పట్టుకోవాలా... ఎక్కడ పట్టుకోవాలా అని.

అక్క ఓ ఉపాయం చెప్పింది. చెల్లె అది అపాయమంది. చెల్లె ఓ ప్లాను చెప్పింది. అక్క అది ఫ్లాపంది. మొత్తం మీద చెల్లెల్ని పట్టుకోవాలన్న పట్టుదల ఇద్దరిలో పెరిగిపోయింది.

'మరి కష్టజీవిని చూద్దాం. కష్టజీవికి సొంతమంది కదా...' అక్క అన్నది.

'సరే.. ట్రై చేద్దాం'

'అక్కా... అక్కా... అటు చూడు. అరటిపండ్ల బండి. ఎండిన డొక్కతో బక్కచిక్కిన ఆ తల్లి ఎండలో పండుపండు ఎలా అమ్ముతుందో... ఈమె కష్టజీవే కదా...'

'అవునవును. అబ్బ... ఎంత గిరాకీ... అదే పండ్లన్నీ ఎంత తొందరగా అమ్ముడయితున్నయి. రేటు కూడా ఎక్కువే'

'అక్కా... ఇన్ని పండ్లు అమ్ముతుంది. ఇంత గిరాకీ ఉంది. ఇంత రేటుంది. అయినా ఈ తల్లి బతుకు ఇలా ఎందుకుంది? మొఖం మీద కత్తివేటుకు రక్తం లేదు. నెత్తికి చమురు లేదు. వొంటికి చాలిన బట్టలేదు. కడుపుకు తిండి లేదు'

'అదే చెల్లే మన చెల్లె మహిమ. చూస్తుండు కనిపిస్తుంది'

'అబ్బా... నోట్లు చిల్లర... గల్ల నింపింది'

'చూస్తుండు. అవి ఎక్కడికి చేరుకుంటాయో...'

'అక్కా... ఆ వ్యక్తెవరు. అతని చేతిలో డబ్బునంతా కుమ్మరిస్తుంది. అయ్యో... రెండు పాత పదినోట్లే మిగిలినయి. వాడు ఆమెను ఉరిమురిమి చూస్తున్నాడు. పాతనోట్ల కోసం పేచీ పడుతున్నాడు.'

'వాడు వడ్డీ వ్యాపారి. కడుపులో చల్ల కదలదు. పొద్దునపూట ఎవరికి కావలసినంత అప్పు వారికి ఇస్తాడు. రాత్రిపూట ఇలా వచ్చి వసూలు చేసుకుంటాడు. ఐదేండ్ల కింద మిద్దె ఉండేది. ఇప్పుడు మేడ అయింది'

'అది లేబర్ అడ్డా... శ్రమజీవులకు అడ్డా...' అక్క అన్నది.

'కూలి బాగానే ఉందే... వందా... సరేసరే... ఆడుతు పాడుతు పని. మంచి కూలీ'

ట్రాక్టర్ నిండా కూలీలు బిలబిలమంటూ దిగారు. నాలుగు వేళ్లకు నాలుగు ఉంగరాలు గుండ్రటి పొట్ట ఉన్న వ్యక్తి స్కూటర్ మీద వచ్చి మనిషికి పది పట్టుకుని ఇస్తున్నాడు. ఇదేంటని వారు అడగటం లేదు. వీడు చెప్పటంలేదు.

'వీడు గుత్తేదారు. స్కూటర్ మీద రౌండ్లు వేస్తాడు. పొద్దున సాయంత్రం. ఈ రోజు నయం. ఒక్కోనాడు సగానికి సగం కోత. ఎదురు తిరిగితే పుట్టగతులుండవు. కూలీ దొరకదు' అక్క చెప్పింది.

(మిగతా 27వ పేజీలో)

# ప్రాచీన పల్లవులు

ఇక్ష్వాకుల అనంతరం గొప్ప శక్తిగా ఆవిర్భవించి, ఇక్ష్వాక సామ్రాజ్య పతనానికి నడుం బిగించిన వారు పల్లవులు. (క్రీ.శ.254-630). ప్రాచీన పల్లవులనే ప్రాకృత పల్లవులనీ అంటారు. అసలు పల్లవులలో నాల్గు శాఖలున్నాయని, ప్రాకృత భాషను రాజభాషగా చేసుకున్నవారు ప్రాచీన పల్లవులు కాగా, సంస్కృత భాషను స్వీకరించిన వారు సంస్కృత పల్లవులు. క్రీ.శ.630లో చాళుక్య కుబ్జ విష్ణు వర్ధనుడు దక్షిణాంధ్రను తన పాదాక్రాంతం చేసుకుని పల్లవులను ఆంధ్ర నుంచి తరిమికొట్టాక, వీరు కాంచీపురాన్ని రాజధాని చేసుకుని బృహత్ పల్లవులు (మహా పల్లవులు)గా గొప్ప కీర్తిని గడించారు. ఆ తర్వాతి వారు కడపటి పల్లవులు.

చాలామంది చరిత్రకారులు ప్రాకృత - సంస్కృత పల్లవులు శాతవాహనులకు సామంతులుగా తొండై మండలంలోని కాంచీపురాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించేవారని, శాతవాహన సామ్రాజ్య పతనానంతరం ఇక్ష్వాకులను తుదముట్టించి, గుంటూరు ప్రాంతాన్ని ఆక్రమించి స్వతంత్ర రాజ్యస్థాపన గావించారని అభిప్రాయపడ్డారు. ఎన్నో భిన్నాభిప్రాయాల మధ్య, శాతవాహనులలో కడపటి పులోమావికి సేనాధిపతిగా వ్యవహరించిన స్కంధనాగుని కుమార్తెను వివాహం చేసుకున్న పల్లవ వీర కూర్చవర్మ స్కంధనాగుని అనంతరం పగ్గాలు చేపట్టి క్రీ.శ.260లో ధాన్య కటకంను స్వాధీనపరచుకున్నాడని నిర్ధారించటం జరిగింది. ఆ రకంగా పల్లవ వంశస్థాపకుడు వీరకూర్చవర్మే!

ఈ పల్లవుల పరిపాలనా కాలంలో ఆనంద గోత్రజులు, కదంబులు, శాలంకాయనులు, విష్ణుకుండినులూ కూడా విజృంభించినట్టు తెలుస్తుంది. అయితే నాల్గవ సింహశర్మ (క్రీ.శ.437-460) శత్రువుల నందరినీ ఓడించి తన రాజ్యాన్ని గోదావరీ తీరం వరకు విస్తరింపజేశాడు. అతడి కుమారుడు విజయస్కంద వర్మకు 'త్రిలోచన పల్లవుడ'ని 'ముక్కంటికాడువెట్టి' అని బిరుదులున్నాయి. ఇతడు తిరుమల గిరులతో అడవులు కొట్టించి, ఆలయ చుట్టుపక్కల ప్రాంతాన్ని పూజారులు ఇతర ఆలయ సేవకులకు నివాసయోగం గావించినా ఎక్కువగా ఓటమినే చవి చూడాల్సి వచ్చిందంటారు. కలికాలుడు ఈ త్రిలోచనుడితో ఏటిగట్టుకి తట్టలు మోయించాడట. శత్రువులందరూ తిరగబడి ఆంధ్ర నుంచి పల్లవులను తరిమికొట్టారు. ముఖ్యంగా కరికాల చోళుడు కాంచీపురాన్నే వశపర్చుకోవడంతో, త్రిలోచన పల్లవుడు అతడికి సామంతుడిగా కొనసాగవల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. క్రీ.శ.560-580 ప్రాంతాలలో ఐదవ సింహవర్మ చోళులను ఓడించి పల్లవ రాజ్యాన్ని అదుపులోకి తెచ్చుకున్నట్టూ, అతడి పుత్రుడు సింహవిష్ణువు, మనవడు మొదటి మహేంద్ర వర్మలు దక్షిణాంధ్రను తిరిగి తమ కైవసం చేసుకున్నట్టూ చేజర్ల కపోతేశ్వరాలయ శాసనం చెబుతుంది. బృహత్పల్లవులుగా, మహా పల్లవులుగా పిలువబడిన సింహవిష్ణువు సంతతి వారే ప్రపంచ ప్రసిద్ధి చెందిన గంగావతరణ దృశ్యాన్ని శిల్పీకరించిన, ఏకశిలారథ నిర్మాణాలు చేపట్టిన మహాబలిపుర నిర్మాతలు.

**ఆంధ్ర పరిపాలకుడైన ప్రాకృత సంస్కృత పల్లవులు శాతవాహనుల సంప్రదాయాన్నే పాటిస్తూ, నందిని రాజలాంఛనంగానూ, శివుడి ఆయుధం అయిన ఖట్వాంగాన్ని ధ్వజంగానూ స్వీకరించిన శైవులు. అయినా కూడా వీరి శాసనాలలో విష్ణు నామ స్తోత్రం కనిపిస్తుందని, రాజుల పేర్లు కూడా విష్ణు నామధేయాన్ని కలిగి ఉండటం వల్ల వీరు వైష్ణవులేనని చాటి చెబుతాయి.**

ఆంధ్ర పరిపాలకుడైన ప్రాకృత సంస్కృత పల్లవులు శాతవాహనుల సంప్రదాయాన్నే పాటిస్తూ, నందిని రాజలాంఛనంగానూ, శివుడి ఆయుధం అయిన ఖట్వాంగాన్ని ధ్వజంగానూ స్వీకరించిన శైవులు. అయినా కూడా వీరి శాసనాలలో విష్ణు నామ స్తోత్రం కనిపిస్తుందని, రాజుల పేర్లు కూడా విష్ణు నామ ధేయాన్ని కలిగి ఉండటం వల్ల వీరు వైష్ణవులేనని చాటి చెబుతాయి. ఎంతో చారిత్రిక ప్రశస్తిని కలిగిన గుంటూరు జిల్లా చేబ్రోలు గ్రామంలోని రాజ్యలక్ష్మీ సమేత ఆదికేశవ స్వామి (విష్ణువు) ఆలయం పల్లవ నిర్మితమే. ఎంతో విశాలమైన ఆవరణలో పడమటి దిక్కున తూర్పుముఖంగా ఉన్న ఈ ఆలయ గర్భగృహం, అంతరాలయం, మండప నిర్మాణాలు, అంతరాలయం పక్కగా రాజ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం ఉండి, కళ్యాణ మండపం, ఉన్నతమైన గాలి గోపురం, ధ్వజస్తంభ నిర్మాణాలన్నీ పల్లవ శిల్పశైలికి ప్రతీకలే.

అయితే పల్లవులు అమరావతీ శిల్పశైలినే అనుకరించటం విశేషం.

**-ఉషా లావణ్య**

---

(9వ పేజీ తరువాయి)

ఇద్దరూ అంగడి బజారులోకి వచ్చారు.

ఒకడు కుట్రపన్ని బ్లాక్ చేస్తున్నారు. ఒకరు మోసంతో కల్తీ చేస్తున్నారు. ఒకడు ద్రోహంతో నమ్మిస్తున్నాడు. ఒకడు పెట్టుబడితో ఆక్రమిస్తున్నాడు. ఒకడు తెలివిగా వ్యాపారం చేస్తున్నాడు.

ఏదీ లేక కష్టాన్ని నమ్ముకున్న ఒక్కోడు శక్తినంతా కూడగట్టుకుని రిక్షా తొక్కుతున్నాడు.

'చెల్లెలా... సంపదా... ఎక్కడున్నావమ్మా... ఎక్కడ దాక్కున్నావు... ఎవరి సొత్తయ్యావు... ఎవరికి తొత్తువయ్యావు. చెప్పమ్మా చెప్పు. నోరు విప్పు' అక్క ఆక్రోశం.

ఇప్పుడా నవ్వు లేదు. ఆ పరుగు లేదు. అంతా నిశ్శబ్దం. ఎక్కడో మాయమైంది. అక్కలిద్దరికీ భయమయింది.

'చెల్లెలా లక్ష్మీదేవీ... నేను భూదేవిని పిలుస్తున్నా...' విశ్వకన్ను తెరిచి వెదుకుతూ.

'అమ్మా... లక్ష్మీ... నేను గంగాదేవిని పిలుస్తున్నా' హోరెత్తి అరుస్తూ. ఎక్కడా అలికిడి లేదు. అంతా నిశ్శబ్దం - పూర్తిగా...

ఏదో గుర్తొచ్చినట్టు 'అక్కా... దీనికి ఇంకేమైనా రూపాలున్నాయా?'

'లేకేం... నల్లమొహం ఒకటుంది. అప్పుడప్పుడు ఆ రూపంలో తిరుగుతుంటుంది' కోపంగా.

'అంటే...'

'చెబితే అర్థం కాదమ్మా... చూడాలి. కళ్లనిండా చూడాలి. చీకటి... మరీ చీకటి గదుల్లోకి...' ఇద్దరూ నడుస్తున్నారు. అమెరికాలో ఓ మత పెద్దను చూశారు. దేవుడి పేరు చెప్పి వంద కోట్లు వసూలు చేశాడు. ఇంకా ఇంకా చేస్తున్నాడు. పాపాలు చేసిన జనం పైసలిచ్చి పాపాలు కడుక్కుంటున్నారు.

'అక్కా... అంత సంపదను ఏం చేస్తాడు'

అక్క నవ్వింది 'పేదల కోసం ఖర్చు చేస్తాడు'

'భలే... భలే... ఇదొక్కటైనా మంచిపని. పేదల కోసం ఖర్చవుతుంది. ఎలా ఖర్చు చేస్తారు'

అక్క మరోసారి ఫక్కున నవ్వింది. 'చదువు చెప్పిస్తారు... రోడ్లు వేయిస్తారు. ఇళ్లు కట్టిస్తారు. అప్పులిస్తారు.. దుప్పట్లు... చెద్దర్లు... బియ్యం'

'అలాగా...?' చెల్లెలు ఆశ్చర్యంగా.

'మరి ఇప్పుడు చూడు' అక్క.

ఇండియాలోని ఓ స్వచ్ఛంద సంస్థకు రెండు కోట్లు ఇచ్చాడు ప్రవక్త. పన్ను లేదు. ప్రతిఫలంగా కోటి రూపాయలు. మళ్లీ మతపెద్దకు చేరినయి. ఇంకో కోటి అనేక చేతులు మారి అరిగిపోయినయి. రెండు లక్షలు ఖర్చు చేసి రెండు కోట్ల ఖర్చు రాశారు.

'ఇదమ్మా నలుపు తెలుపు' అక్క చెప్పింది. చెల్లెలు విన్నది.

'అయ్యో అక్కా... అది చెప్పుకోలేదు గాని ఉన్నోడి ఊడిగం చేస్తుంది... అది కూడా స్వేచ్ఛనే కోరుకుంటుంది' చెల్లెలు చెప్పింది.

'దాన్ని కలుపుకుందాం... స్వేచ్ఛగా ఎక్కడికైనా పారిపోదాం...' అక్క అన్నది.

ఇద్దరూ ఎగిరిపోవాలని చూశారు. చుట్టూ ఇనుప కంచెలు. బలమైన గోడలు... బలమైన హస్తాలు... ఎగరడం సాధ్యం కాలేదు. తప్పించుకోవాలని చూశారు. అవకాశం లేదు.

తాము బందీలమని గ్రహించారు. తమలా చెల్లెళ్ని ఎవరో బంధించారని అర్థమయింది. భయంతో చెల్లెలు అక్కను హత్తుకుపోయింది. ధైర్యం చెబుతూ చెల్లెళ్ని చేరదీసి హృదయానికి హత్తుకుంది అక్క.

కనిపించని చెల్లెలి కోసం ఒక అక్క చెట్టు గుట్ట కొండ కోనల్ని వెదుకుతుంది. భూమండలం వడపోస్తోంది. ఇంకో అక్క చుట్టూ తిరుగుతూ విశ్వాంతరాళంలో జల్లెడ పడుతోంది.

ఇద్దరూ... బందీగానే. ★

రచయిత చిరునామా:
**పెద్దింటి అశోక్‌కుమార్**
మల్లారెడ్డిపేట, గంభీరావుపేట
కరీంనగర్.